ప్రతిభకు పురస్కారం

హుసాముద్దీన్‌కు అర్జున అవార్డు
మెరిసిన ఇందూరు యువ బాక్సర్
షమీ, శీతల్, వైశాలికి తగిన గుర్తింపు
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రదానం

షమీ

న్యూఢిల్లీ: జాతీయ, అంతర్జాతీయ వేదికలపై దేశ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన ప్లేయర్ల ప్రతిభకు గుర్తింపు దక్కింది. పలు ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాలు కొల్లగొట్టిన ప్లేయర్లను కేంద్ర క్రీడాశాఖ సముచిత రీతిలో గౌరవించింది. మంగళవారం రాష్ట్రపతి భవన్ వేదికగా కన్నుల పండువగా జరిగిన వార్షిక క్రీడా అవార్డుల వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..ప్లేయర్లకు అవార్డులు ప్రదానం చేశారు. వాస్తవానికి జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29) రోజు అవార్డుల కార్యక్రమం జరుగాల్సి ఉన్నా.. ఆసియాగేమ్స్‌తో వాయిదా పడింది. నిరుడు జరిగిన ఆసియాగేమ్స్‌లో పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీకి ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారం దక్కింది. ప్రస్తుతం మలేషియా ఓపెన్‌లో ఆడుతున్నందున కార్యక్రమానికి వారు హాజరు కాలేకపోయారు. నిరుడు ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్..రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. మరోవైపు వన్డే ప్రపంచకప్‌లో 24 వికెట్లతో అదరగొట్టిన టీమ్‌ఇండియా స్పీడ్‌స్టర్ షమీ, చేతులు సరిగ్గా లేకపోయిన ఆర్చరీలో అద్భుతాలు సృష్టిస్తున్న జమ్ముకశ్మీర్ ఆర్చర్ శీతల్‌దేవి, యువ గ్రాండ్‌మాస్టర్ వైశాలి, ఆంధ్ర అంధ క్రికెటర్ అజయ్‌కుమార్ రెడ్డి అతిథుల కరతాళ ధ్వనుల మధ్య అవార్డులు అందుకున్నారు. ఏషియన్ క్వాలిఫయర్స్ టోర్నీలో ఆడుతున్న యువ షూటర్ ఇషాసింగ్ కార్యక్రమానికి హాజరుకాలేకపోయింది. ఖేల్‌రత్న అవార్డు కింద పురస్కారంతో పాటు 25 లక్షలు, అర్జున గ్రహీతలకు 15 లక్షల నగదు ప్రోత్సాహం దక్కింది. కోచ్ రమేశ్‌ను ద్రోణాచార్య అవార్డు వరించింది.

వైశాలి

శీతల్

హుసామ్

తెలంగాణ గెలుపు జోరు

జాతీయస్థాయి కబడ్డీ టోర్నీ

కామారెడ్డి, జనవరి 9: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య తెలంగాణ 15 పాయింట్ల తేడాతో విద్యాభారతిపై అద్భుత విజయం సాధించింది. మిగతా మ్యాచ్‌ల్లో రాజస్థాన్ 9 పాయింట్లతో మధ్యప్రదేశ్‌పై, ఒడిశా 5 పాయింట్లతో చండీఘడ్‌పై, ఉత్తరప్రదేశ్ 28 పాయింట్లతో జార్ఖండ్‌పై, కర్ణాటక 44 పాయింట్లతో జమ్ముకశ్మీర్‌పై, ఢిల్లీ 8 పాయింట్లతో పాండిచ్చేరిపై, ఢిల్లీ 12 పాయింట్లతో తమిళనాడుపై గెలిచి టోర్నీలో ముందంజ వేశాయి.

శ్రీకాంత్ శుభారంభం

- మలేషియా బ్యాడ్మింటన్ ఓపెన్

కౌలాలాంపూర్: బ్యాడ్మింటన్ తాజా సీజన్‌లో భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-1000 మలేషియా ఓపెన్‌లో శ్రీకాంత్ ప్రిక్వార్టర్స్‌కు చేరాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో జొనాథన్ క్రిస్టిని చిత్తుచేశాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా జోడీ రెండో రౌండ్‌కు చేరగా.. రుతుపర్ణ-శ్వేతపర్ణ జంట తొలి రౌండ్‌లోనే ఓడింది. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి పరాజయం పాలవగా.. అర్జున్-ధ్రువ్ ద్వయం తొలిరౌండ్‌లో ఓడింది.

బ్యాడ్మింటన్ చాంప్ చరిష్మ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండియా జూనియర్ ర్యాంకింగ్ నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో సూర్య చరిష్మ, ధృవ్ విజేతలుగా నిలిచారు. మంగళవారం బాలికల అండర్-19 సింగిల్స్ ఫైనల్లో సూర్య చరిష్మ 11-21, 21-8, 21-18తో అలిషానాయక్‌పై గెలిచింది. మరోవైపు బాలుర అండర్-19 తుది పోరులో ధృవ్ 21-16, 23-21తో గిన్‌పాల్‌పై గెలిచి టైటిల్ దక్కించుకున్నాడు. స్టార్ షట్లర్ సిక్కిరెడ్డి, అర్జున్‌రెడ్డి, పీసీఎస్‌రావు, శ్రీనివాస్‌రావు, బాబు హాజరయ్యారు.

ఫిట్‌రైజ్ ట్రయల్ థాన్ విజేత మహారాష్ట్ర

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : 'ఫిట్‌రైజ్ ఇండియా 75' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో నిర్వహించిన ట్రయల్ థాన్‌లో మహారాష్ట్ర పోలీసులు విజేతగా నిలిచారు. 27 అక్టోబర్ 2023న ఎన్‌పీఏలో ప్రారంభమైన పోటీలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్ పోటీల్లో మొదటిస్థానంలో మహారాష్ట్ర, రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్, మూడోస్థానంలో ఉత్తరప్రదేశ్ నిలిచింది. తెలంగాణకు 12వ స్థానం దక్కింది.

సింధు పునరాగమనం

న్యూఢిల్లీ: గాయం నుంచి కోలుకుంటున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో జాతీయ జట్టు తరపున బరిలోకి దిగనుంది. వచ్చే నెల 13 నుంచి మలేషియా వేదికగా జరగనున్న ఈ టోర్నీ కోసం మంగళవారం జట్లను ప్రకటించారు. ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్ జరగనున్న నేపథ్యంలో.. ర్యాంకింగ్ పాయింట్లు పెంచుకునేందుకు మన షట్లర్లకు ఇది చక్కటి అవకాశం కానుంది.

సమర్పయామి!

2-1తో సిరీస్ నెగ్గిన ఆస్ట్రేలియా • మూడో టీ20లో భారత్ ఓటమి

పొట్టి ఫార్మాట్‌లో కంగారూలకు గట్టి పోటీనిచ్చిన భారత మహిళల జట్టు సిరీస్ మాత్రం సాధించలేకపోయింది. తొలి పోరులో నెగ్గి ఆశలు రేపిన టీమ్‌ఇండియా.. ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడి సిరీస్ కోల్పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పేలవ ఫామ్ కొనసాగించగా.. బ్యాటర్ల నిలకడలేమి భారత్‌ను దెబ్బకొట్టింది. మరోవైపు వన్డే సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన ఆస్ట్రేలియా.. టీ20ల్లోనూ దుమ్మురేపి రెండు సిరీస్‌లతో సగర్వంగా స్వదేశానికి తిరుగుపయనమైంది!

స్మృతి (29)

ముంబై: ఆస్ట్రేలియాపై టెస్టు మ్యాచ్ నెగ్గిన భారత మహిళల జట్టు.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అదే ఊపు కొనసాగించలేకపోయింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ ఆసీస్‌పై తొలిసారి టీ20 సిరీస్ గెలువాలనుకున్న మన అమ్మాయిల ఆశ నెరవేరలేదు. వన్డేల్లో వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. టీ20 సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన చివరి పోరులో హర్మన్‌ప్రీత్ బృందం 7 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో పరాజయం పాలైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 147 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధన (29; 2 ఫోర్లు, ఒక సిక్సర్), షఫాలీ వర్మ (26; 6 ఫోర్లు) జట్టుకు మెరుగైన ఆరంభాన్నివ్వగా.. వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ (34; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు వేలాది మంది అభిమానులు తరలిరాగా.. రిచ భారీ షాట్లతో మైదానాన్ని హోరెత్తించింది. కెప్టెన్ హర్మన్ (3), జెమీమా రోడ్రిగ్స్ (2) విఫలం కావడంతో భారత్ ఆశించినంత భారీ స్కోరు చేయలేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో జార్జియా, అనాబెల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆసీస్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. ఓపెనర్లు అలీసా హీలీ (55; 9 ఫోర్లు, ఒక సిక్సర్), బెత్ మూనీ (52 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధశతకాలతో అదరగొట్టడంతో ఆసీస్ అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. గతంలో పోల్చుకుంటే.. భారత జట్టు ఫీల్డింగ్ మెరుగైనా.. అంతర్జాతీయ ప్రమాణాలకు ఇంకా దూరంగానే ఉండటంతో.. ప్రత్యర్థి ప్లేయర్లకు భారీ స్కోరు చేసేందుకు చేతులారా అవకాశమిచ్చినట్టైంది. మన బౌలర్లలో పూజ వస్త్రాకర్ రెండు వికెట్లు పడగొట్టింది. అనాబెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', అలీసా హీలీకి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 147/6 (రిచ 34, స్మృతి 29; అనాబెల్ 2/12, జార్జియా 2/24), **ఆస్ట్రేలియా:** 18.4 ఓవర్లలో 149/3 (అలీసా 55, మూనీ 52 నాటౌట్; పూజ 2/26).

భారత్, ఇంగ్లండ్ మ్యాచ్ బడిపిల్లలకు ఫ్రీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బడి ఈడు పిల్లలకు బంపర్ ఆఫర్. భారత్, ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం. ఈ నెల 25 నుంచి ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఇరు జట్ల మధ్య మొదలయ్యే టెస్టు మ్యాచ్ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూళ్లలో 6-12 తరగతులకు చెందిన విద్యార్థులకు ఉచితంగా మ్యాచ్‌ను చూసే అవకాశం కల్పిస్తున్నది. మ్యాచ్‌ను చూడాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా వారి స్కూల్ యూనిఫామ్‌లో స్టేడియానికి రావాల్సి ఉంటుందని హెచ్‌సీఏ పేర్కొంది. స్టేడియానికి వచ్చే పిల్లల కోసం హెచ్‌సీఏ ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నది. ఈ నెల 18లోగా ఆసక్తి ఉన్న స్కూల్ యాజమాన్యాలు హెచ్‌సీఏ సీఈవోకు ceo.hydca@gmail.com మెయిల్ ద్వారా గానీ స్టేడియంలో గానీ తెలియజేయాలని హెచ్‌సీఏ తెలిపింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.